మల్లన్న జాతర షురూ



మల్లన్న జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

శంషాబాద్: పట్టణంలోని మెహిదిగార్డెన్ సమీపంలో గల మల్లన్న ఆలయంలో ఆదివారం జాతర ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానసిక ప్రశాంతతను ఇస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ డి.వెంకటేశ్‌గౌడ్, మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ

శంషాబాద్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలు తగ్గుముఖం పడుతాయని ఆర్‌జీఐఏ ట్రాఫిక్ సీఐ రాజు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇతర వాహనదారులు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. మద్యం తాగి, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని అంకితను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు ఎం.సుగుణ, ఉపాధ్యాయులు



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రభుత్వోన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎం అంకిత 67వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ సైక్లింగ్ పోటీలకు ఎంపికైంది. జనవరి 28 నుంచి 30 వరకు ఉస్మానియా యూనివర్సిటీ సైక్లింగ్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అంకిత ప్రతిభ చూపింది. ఈ నెల 7 నుంచి 12 వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు పాఠశాల పీఈటీ కె.సత్యనారాయణ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థినిని ప్రధానోపాధ్యాయురాలు ఎం.సుగుణ, ఉపాధ్యాయులు అభినందించారు.

కృష్ణ రివర్ క్రాస్ స్విమ్మింగ్ పోటీల్లో..

రాజేంద్రనగర్: అమరావతిలో ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 24వ కృష్ణ రివర్ క్రాస్ స్విమ్మింగ్ పోటీల్లో రాజేంద్రనగర్ అత్తాపూర్‌కు చెందిన పుల్లారెడ్డి పాల్గొన్నారు. 1.5 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రివర్‌ను ఆయన 33 నిమిషాల్లో దాటి రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పుల్లారెడ్డిని ఘనంగా సన్మానించి ట్రోఫీతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



రాయదుర్గం: జీవనశైలి, వాతావరణంలోని మార్పులతోనే వ్యాధులు వస్తున్నాయని వైద్యాధికారులు తహజబీన్, తేజస్వి, సుమన్ అన్నారు. నానక్‌రాంగూడ స్టార్ ఆస్పత్రి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో శారద హైస్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని అంటారని, అందువల్ల కొన్ని జాగ్రత్తలు తీసుకున్నచో మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందన్నారు. ప్రతినిత్యం వ్యాయామం, మెడిటేషన్, యోగ, ధ్యానం, నడక కనీసం 40 నిమిషాలు చేయాలని సూచించారు. సాధ్యమైనంతవరకు తాజా ఆకుకూరలు, సీజనల్ పండ్లు, పాలు, పాల ఉత్పత్తులు, చేపలు,గుడ్లు, తృణధాన్యాలు, డ్రైఫ్రూట్స్ వంటి పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సాధ్యమైనంతవరకు ఆల్కహాల్, పొగాకు, ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనారోగ్యంపై శ్రద్ధ చూపుతూ.. వైద్యుల సూచనలు, సలహాలను విధిగా పాటించాలన్నారు. ఈ సందర్భంగా 105 మందికి ఎత్తు, బరువు, రక్తపోటు, షుగర్, పల్స్, కంటి, దంత, బీఎండీ పరీక్షలతో పాటు ఈసీజీ పరీక్షను నిర్వహించారు. అనంతరం శ్రీ నేత్రాలయ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలను చేశారు. స్కూల్ కరస్పాండెంట్ బంద నరేంద్రబాబు, సభ్యులు అన్నయ్య చౌదరి, వాణిసాంబశివరాలు, సుబ్రహ్మణ్యం, కామేశ్వరరావు, రాజుగౌడ్, ఆస్పత్రి ప్రతినిధి జాకీర్ హుస్సేన్, స్టార్ ఆస్పత్రి, నేత్రాలయ వైద్య సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న 'నేషనల్ హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో' గాంధీ బుణాకర్ మేళ నిర్వహించారు. ఈ మేళాలో భాగంగా ఆదివారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. నృత్యాంజలి స్కూల్ ఆఫ్ డాన్స్ నాట్య గురువు శృతికిరణ్ శిష్యబృందంచే భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. పుష్పాంజలి, అలరిపు, మూషికవాహన, మహాగణపతి, గణేశపంచరత్న తదితర అంశాలను కళాకారులు అనన్య, ఆద్య, నిత్యశ్రీ, వంశిక, తన్వీ, రియా, శ్రీయ, శాన్వి, పూర్వి, పవిత్ర, హిరణ్య, మహతి, మైత్రి తదితరులు పాల్గొని ప్రదర్శించారు. ప్రముఖ నాట్య గురువులు హరి మంగళంపల్లి, మృదుల ఆనంద్, వైదేహీ సుభాష్, ప్రముఖ సంగీత కళాకారులు నేపథ్య గాయని శ్రీనిధి తిరుమల పాల్గొని కళాకారులను అభినందించారు.



ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్న విద్యార్థులు

బిక్కుబిక్కుమంటూ రోడ్డు దాటుతూ..

- మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధి దుర్గానగర్ ప్రధాన రహదారిపై రద్దీ
- వేగంగా దూసుకువస్తున్న వాహనాలు
- ఇప్పటికే ప్రమాదాల బారిన విద్యార్థులు
- రోడ్డు దాటాలంటేనే జంకుతున్న ప్రజలు, స్టూడెంట్స్
- పట్టించుకోని అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని దుర్గానగర్ ప్రధాన రహదారిపై ట్రా'ఫికర్' నెలకొన్నది. నిత్యం వాహనాలు వేగంగా దూసుకువస్తుండడంతో ప్రజలు, విద్యార్థులు రోడ్డు దాటాలంటేనే జంకుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎటు నుంచి ఏ వాహనం వచ్చి ఢీకొడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అయినా వీరి బాధలను ఏ నాయకుడు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని దుర్గానగర్ ప్రధాన రహదారిలో పోలీస్‌స్టేషన్‌కు ఆనుకొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉన్నది. ఇందులో సుమారు 1000 మంది విద్యార్థులు చదువుతుండగా, పదుల సంఖ్యలో ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే వీరు ప్రతిరోజూ స్కూల్‌కు రావాలన్నా.. తిరిగి ఇంటికి వెళ్లాలన్నా.. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రోడ్డును దాటుతున్నారు. గడిచిన రెండు వారాల్లో నలుగురు విద్యార్థులు ప్రమాదాల బారిన పడగా, అందులో ఓ విద్యార్థి కాలు కూడా విరిగింది. గతంలోనూ అనేకమంది స్టూడెంట్స్ గాయపడ్డారని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. 2014లో పాఠశాల ఏర్పడినప్పుడు వాహనాల రద్దీ చాలా తక్కువగా ఉండేది. అయితే గత పదేళ్లలో ట్రాఫిక్ దాదాపు నాలుగింతలు పెరిగింది. దీంతో విద్యార్థులు రోడ్డు దాటడం కష్టంగా మారింది. అయినా ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి రక్షణ పరికరాలు, లేదా సిగ్నల్స్ ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. రోడ్డుకిరువైపులా ఎమ్మెల్యే , కార్పొరేటర్ ఇండ్లు ఉన్నప్పటికీ విద్యార్థుల తిప్పలను మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ సమయం ముగిసిన తర్వాత ట్రాఫిక్ పోలీసులు కొన్ని నిమిషాలు పాటు అక్కడ ట్రాఫిక్‌ను నియంత్రణ చేయాలని పలుమార్లు కోరినప్పటికీ పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా ఉపాధ్యాయులే వలంటీర్లుగా నిల్చొని విద్యార్థులను రోడ్డు దాటించాలని సలహాలు ఇస్తున్నారని టీచర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థుల బాధలను పట్టించుకోవాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నారు..



విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో వాహనాలు వేగంగా వస్తున్నాయి.ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. గత రెండు వారాల్లోనే నలుగురు విద్యార్థులు ప్రమాదాల బారిన పడ్డారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి ప్రమాదాల నివారణకు సిగ్నల్స్ లేదా పోలీసులను నియమిస్తే బాగుంటుంది.

–సురేశ్, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు

ప్రమాదాల నివారణకు చర్యలు..



మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రోడ్డు దాటుతూ ప్రమాదాలు జరగకుండా పెలికాన్ సిగ్నల్ ఏర్పాటు చేశాం. కానీ అవి పని చేయడం లేదు. దీంతో ఇకనుండి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో కానిస్టేబుళ్లతో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతాం. టీచర్లే విద్యార్థులను రోడ్డు దాటించాలని ఎవరూ అనలేదు.

– బోసుకిరణ్, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

ఏరిట్ ఆసుపత్రి వైద్యుడు విజయ్‌కరణ్‌రెడ్డి



డాక్టర్లను సత్కరిస్తున్న కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సీతారాం

మణికొండ: కేన్సర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏరిట్ ఆసుపత్రి డాక్టర్ విజయ్‌కిరణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ప్రపంచ కేన్సర్ డేను పురస్కరించుకొని మణికొండ మున్సిపాలిటీ, పంచవటి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం, నిర్ధారణ పరీక్షలు, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేటా 16 లక్షల మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారని, దానిపై అవగాహన, నివారణ, గుర్తింపు, చికిత్సకు ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4వ తేదీని కేన్సర్ డే గా జరుపుకుంటున్నామన్నారు. మనం తీసుకునే ఆహారం, కాలుష్యం, ప్లాస్టిక్ వినియోగం, వయస్సు కారణంగా కేన్సర్ వ్యాధి సంక్రమిస్తుందని, వాటిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకుంటే జయించవచ్చన్నారు.

◆ వ్యక్తిగత శుభ్రత, 40 ఏళ్లు దాటినా ప్రతి మహిళ కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ శిల్ప సూచించారు. ఈ సందర్భంగా 60 మంది మహిళలకు అత్యాధునిక యంత్ర పరికరాలతో మోమో గ్రఫీ, సర్వైకల్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి.సీతారాం, నాయకులు సాగర్, రామసుబ్బారెడ్డి, పార్వతి, రాధా మాంగళ్య వైద్యులను సత్కరించారు.

అమృత అవెన్యూ అసోసియేషన్ నూతన కమిటీ



అమృత అవెన్యూ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ అమృత అవెన్యూ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవికుమార్, ఉపాధ్యక్షుడిగా ప్రదీప్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.నర్సింహాబాబు, కోశాధికారిగా భాస్కర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పాపయ్యయాదవ్, విజయ్, విమల్, జగదీశ్, శ్రీదేవి, తేజ వికాస్, అనితాచౌదరి, లలిత, రాజ్‌గౌడ్, అడ్వైజరీ బాడీగా జయప్రకాశ్ (అడ్వకేట్), శంకర్, అంజనేయులు తదితరులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని అసోసియేషన్ వాసులు ఘనంగా సన్మానించారు. అనంతరం అధ్యక్షుడు రవి కుమార్ మాట్లాడుతూ సభ్యులందరిని కలుపుకుంటూ ముందుకు సాగుతామన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మంచిరేవుల మల్లన్నను దర్శించుకున్న కాంగ్రెస్, బీజేపీ అధ్యక్షులు

బో'నమో' మల్లన్న

మంచిరేవులలో ఉత్సవాలు షురూ



స్వామివారిని దర్శించుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖ

మణికొండ: డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలు, పోతురాజులు, ఒగ్గు కళాకారుల విన్యాసాల మధ్య మంచిరేవుల గ్రామంలో ఆదివారం మల్లన్న స్వామి బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం గంపలు తీసుకొని గ్రామస్తులు సామూహికంగా ఔటర్‌రింగ్ రోడ్డు పక్కనున్న ఆలయానికి చేరుకున్నారు. అనంతరం శుద్ధి, అగ్నిగుండాలు తొక్కటం, గొలుసులు తెంపటం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం అక్కడే సిద్ధం చేసుకున్న బోనాలతో మహిళలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారిని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖాయాదగిరి, నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎం. ప్రవీణ్‌యాదవ్, నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు క్యాతం అశోక్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు భిక్షపతియాదవ్ తదితరులు దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి డి.భాస్కర్‌కురుమ, నాయకులు డి.లక్ష్మణ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం బీరప్ప, మంగళవారం రేణుకా ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు ఉంటాయని ఆలయ కమిటీ నాయకులు తెలిపారు.

వివాహిత అదృశ్యం



భవానీ

మణికొండ: పిల్లలతో కలిసి చెప్పాపెట్టకుండా ఓ మహిళ ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిరేవుల గ్రామానికి చెందిన టి.మహేశ్ తన భార్య భవానీ, పిల్లలు అనిరుధ్, అన్విత్‌తో కలిసి ఉంటున్నారు.ఈ నెల 1వ తేదీన ఉదయం 6.30 గంటలకు భవానీ భర్తకు చెప్పకుండా పిల్లలను తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో మహేశ్ పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మియాపూర్ : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని జేపీనగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య, మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, సమస్య తిరిగి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

శేరిలింగంపల్లిలో 7.47 లక్షల ఓటర్లు

- 8 న తుది ఓటరు జాబితా విడుదల

శేరిలింగంపల్లి: రాష్ట్రంలో అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా శేరిలింగంపల్లి మరోసారి గుర్తింపు పొందింది. శేరిలింగంపల్లిలో ప్రస్తుతం 7,47,671 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాలలో ఇంత పెద్ద ఎత్తున ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా గుర్తింపు సాధించడం విశేషం. ఇందులో 3,95,460 మంది పురుషులు, 3,52,067 మంది స్త్రీలు, 144 మంది థర్డ్ జెండర్ ఓటర్లుగా గుర్తించారు. పార్లమెంటు ఎన్నికల ముందు తుది ఓటరు జాబితాను ఈనెల 8న విడుదల చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

హఫీజ్‌పేట్: తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ స్పష్టం చేశారు. హఫీజ్‌పేట్‌లోని 'కేఎస్ఆర్ టుగెదర్‌మెంట్స్, అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్' ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ వాసులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కేఎస్ఆర్ టు గెదర్‌మెంట్ అపార్ట్‌మెంట్స్ ఇబ్బందులు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటామన్నారు. పార్కు, మౌలిక వసతులు, తాగునీటి సమస్య, విద్యుత్ దీపాల సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ వాసులు మంజీరా తాగునీటి సమస్యను తీర్చాలని, బిల్డర్ పేరు చెప్పి ప్రైవేటు వ్యక్తులు వచ్చి ఇబ్బందులకు గురిచేస్తూ.. మనశ్శాంతి లేకుండా చేస్తున్నారన్నారు. దీంతో పలు సమస్యలను వారు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి సమస్య పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్ శ్రీకాంత్, గౌతమ్‌గౌడ్, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.



విశాఖపట్నంలో జరిగిన కరాటే పోటీల్లో పతకాలు సాధించిన స్కాలర్స్ విద్యార్థులు

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మణికొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో ఆదివారం జరిగిన ఏడో అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో అలకాపూర్ టౌన్‌షిప్‌లోని స్కాలర్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. పలు విభాగాల్లో పోటీ పడి బంగారు, సిల్వర్ పతకాలు సాధించారు. టి.విలాసిని, సి. హన్సివివక, గౌతమ్‌కుమార్, తరన్‌రంగా, బి. ప్రేరణ, జి. వర్షిణి, కె. అన్విత్ బంగారు పతకాలు, టి. ఆదిత్య, జి.సహర్షిత, వై.ముని లక్షాయణరెడ్డి సిల్వర్ మెడల్స్ సాధించారని కోచ్ రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.



మణికొండలో జరిగిన పోటీల్లో బెల్టులు సాధించిన విద్యార్థులు

మణికొండలో..

మణికొండ మర్రిచెట్టు సమీపంలోని విక్టరీ తైక్వాండో కరాటే అకాడమీలో జరిగిన బెల్టుల పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన ఇచ్చారు. గ్రాండ్ మాస్టర్ మనోహర్, వెంకటేశ్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ చూపి గ్రీన్, బ్రౌన్, బ్లాక్ బెల్టులు సాధించారు.

నలుగురు చిన్నారుల అదృశ్యం

- సీసీ ఫుటేజీలతో చేధించిన మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు
- తల్లిదండ్రులకు అప్పగింత



పోలీసుల సమక్షంలో ఉన్న చిన్నారులు

మైలార్‌దేవ్‌పల్లి: నలుగురు చిన్నారులు అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మధు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం కొన్ని రోజుల క్రితం దానమ్మ జోపిడి ప్రాంతానికి వలస వచ్చింది. వారి పిల్లలు నలుగురు చిన్నారులు శనివారం ఇంటి ముందు ఆడుకుంటూ అదృశ్యమయ్యారు. తల్లిదండ్రులు కూలీ పని చేసి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి కనిపించలేదు. చుట్టుపక్కలా, తెలిసిన వారిని అడుగగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు పలు బృందాలుగా విడిపోయి రోడ్లపై ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ఈ క్రమంలో చిన్నారులు నాంపల్లి వైపు నడుచుకుంటూ వెళ్లినట్లు గుర్తించి చైల్డ్ ప్రొటెక్షన్ ఫోర్స్ వారికి సమాచారం ఇచ్చారు. వెంటనే వారు రంగంలోకి నలుగురు చిన్నారులను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

రంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ప్రవీణ్‌రావు



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న రంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ప్రవీణ్‌రావు

గచ్చిబౌలి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకంపై మరింత అవగాహన అవసరమని రంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఎం.ప్రవీణ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం గచ్చిబౌలి స్టేడియం వద్ద రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా అవగాహన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారిలో 80 శాతం మంది ద్విచక్ర వాహనదారులే ఉంటున్నారన్నారు. హెల్మెట్ ధరించకపోవడంతోనే ప్రమాదాల్లో మరణిస్తున్నట్లు లెక్కల్లో స్పష్టమవుతుందన్నారు. కొందరు హెల్మెట్ ధరించినా బెల్టు లాక్ చేయకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. మితి మీరిన వేగంతో వాహనాలను నడపడం సరికాదన్నారు. మద్యం మత్తులో, సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలను పాటించాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రజల సహకారం అవసరమని ఆయన చెప్పారు. కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ కొనసాగింది. ఎంవీఐలు విజయరావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో వైద్య సేవలు



వైద్య శిబిరంలో వలంటీర్లకు జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు

గచ్చిబౌలి: పేదలకు వైద్య సేవలను అందించేందుకు గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్వేచ్ఛ, కేర్ అండ్ కేరీర్ చారిటీ, ఎస్‌వీకే సంస్థలు సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు పేదలకు వైద్య సేవలను అందించారు. గచ్చిబౌలి పరిసరాల్లోని స్లమ్ ఏరియా ప్రజలే కాకుండా నగర శివారులోని వారు కూడా రైళ్లలో వచ్చి వైద్య సేవలను పొందడం విశేషం. ఈ సందర్భంగా పలువురు వైద్య సేవలను అందిస్తూ.. ప్రజలకు తగిన సలహాలు, సూచనలు కూడా ఇచ్చారు. ఆరోగ్యంపై ఎలా శ్రద్ధ తీసుకోవాలో వివరించారు. అనంతరం నిర్వహకులు వైద్య శిబిరంలో సేవలందించిన డాక్టర్లు, వలంటీర్లుగా పనిచేసిన వారికి మెమెంటోను అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 9వేల మందికి పైగా వైద్య సేవలు అందించగా కంటి ఆపరేషన్లను 100 మందికి చేయడం విశేషం, ఇప్పటి వరకు 50 మంది వైద్యులు, వందలాదిమంది వాలంటీర్లుగా రెగ్యులర్‌గా పాల్గొంటున్నారన్నారు.

'ఆలివ్ డెంటల్ వరల్డ్' ఆస్పత్రి ప్రారంభం

మాదాపూర్: దంతవైద్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం చాలా పెరిగిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని కాకతీయహిల్స్‌లో ఆదివారం ఆలివ్ డెంటల్ వరల్డ్ ఆస్పత్రిని ఆయన సినీ నిర్మాత దిల్‌రాజుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అత్యాధునిక పరికరాలు, కొత్త తరహా పద్ధతులు అద్భుతంగా ఉన్నాయని యాజమాన్యాన్ని కొనియాడారు. రోగులకు నాణ్యమైన చికిత్సను అందించాలని కోరారు. జగిని వెంకన్న, డాక్టర్ ఆదిత్య జగిని, డాక్టర్ పూజసాయి, డాక్టర్ అర్జున్, శ్రీనివాస్, యుగంధర్, కల్వ ఉదయ్‌కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.